ఏడాదిగా పడకేసిన కీలక ప్రాజెక్టులు

- నరసాపురం అభివృద్ధిపై దృష్టి పెట్టిన జగన్ సర్కార్
- కూటమి ప్రభుత్వంలో అర్ధాంతరంగా నిలిచిన పనులు

నరసాపురం: నరసాపురం ప్రాంతం అభివృద్ధిపై గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రికార్డు స్థాయిలో రూ.3,200 కోట్ల అభివృద్ధి పనులకు స్వయంగా జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురం వచ్చి శంకుస్థాపన చేశారు. వాటిలో కొన్ని ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయడం, టెండర్లు పిలవడం కూడా చేశారు. అయితే పనులు మొదలు కాబోతున్నాయన్న తరుణంలో ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. అయితే అభివృద్ధి పనులకు నిధులు మంజూరై ఉన్నాయి కాబట్టి కాస్త అలస్యంగానైనా తమ కలలు సాకారం అవుతాయని నియోజకవర్గ ప్రజలు ఆశించారు. అయితే కూటమి సర్కార్ వచ్చిన తరువాత సీన్ రివర్స్ అయ్యిది. పనులు ప్రారంభం కావాల్సిన ఒక్క ప్రాజెక్ట్ కూడా ముందుకు వెళ్లకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కార్ గద్దె నెక్కి ఏడాది పూర్తవుతుంది. అసలు గత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టలను ఈ ప్రభుత్వం పూర్తి చేస్తుందా? లేదా అనే అనుమానం ప్రజల్లో ఉంది.

టెండర్లు పిలిచినా మొదలు కాని వైనం

మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ.220 కోట్ల ప్రాజెక్టుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ భారీ భారీ ప్రాజెక్టుకు సంబంధించి మొదటి విడతలో పట్టణంలోని 1 నుంచి 9 వరకూ వార్డుల్లో పనులు చేపట్టడానికి రూ 87 కోట్లు మంజూరు చేయడం, టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. పట్టణంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్స్ శిథిలం కావడంతో కొత్త పైప్‌లైన్స్ ఏర్పాటుకు రూ.81.81 కోట్లతో స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు చేసి టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఉన్న పాత పైప్‌లైన్స్ మొత్తం మార్చిడమే కాకుండా కొత్తగా మరో 4 కిలోమీటర్ల మేర పైప్‌లైన్స్ వేసి మరో 40 ఏళ్ల వరకూ మున్సిపాలిటీలో మంచినీటి సమస్య లేకుండా చేయాలన్నది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయింది. 70 ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయానికి సొంతగూడు లేకపోవడంతో ప్రస్తుత కాటన్ పార్కు పక్కన రూ.2.50 కోటలతో అధునాతన వసతులతో కొత్త భవన నిర్మాణం చేపట్టారు. కూటమి వచ్చిన వెంటనే పనులు నిలియిపోయాయి. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, భీమవరం మండలాలకు లో-ఓల్టేజ్ సమస్యకు చెక్ పెడుతూ రూ 100 కోట్లతో నరసాపురంలో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి పూనుకుంది జగన్ సర్కార్. రుస్తుంబాధలో 10 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించారు. ఈ ప్రాజెక్ట్ కూడా అటకెక్కింది. నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్‌థియేటర్‌ను పడగొట్టి దాని స్థానంలో ఓపెన్ ఆడిటోరియం రూ 3.50 కోట్లతో నిర్మించేలా పనులు ప్రారంభించారు. పనులు చివరిదశలో ఉండగా ఎన్నికలు వచ్చిన ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. వశిష్ట వంతెన, బియ్యపు తిప్ప మేజర్ ఫిషింగ్ హార్బర్‌ని ర్మాణం, ఆక్వా యూనివర్సిటీ భవనాల నిర్మాణాలు వంటి భారీ ప్రాజెక్టులు కూడా ఏడాదిగా నిలిచిపోయాయి.


ప్రభుత్వం మారడంతో మధ్యలో నిలిచిపోయిన మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం పనులు

కక్షగట్టి చేస్తున్నారు


నరసాపురం అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. కోట్లాది రూపాయల ప్రాజెక్టులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి కృషితో చాలా ప్రాజెక్టలకు నిధులు మంజూరు చేయడం, పనులకు టెండర్లు కూడా పిలిచారు. నిధులు అందుబాటులో ఉండి కూడా పనులు ఎందుకు చేయడం లేదో? అర్థం కావడంలేదు. ఏదో కక్షగట్టినట్టు చేస్తున్నారు. మా ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టలను ఏడాదిగా ఆపేసి కూర్చుంది కూటమి ప్రభుత్వం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్

క్లుప్తంగా

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి


గ్రంథాలయం ఆవరణలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో శనివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తర్వాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బీజీబీఎస్ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమ్మాజీ, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ, ఆత్మూరి రమ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ పార్కులో సౌకర్యాలు మెరుగుపర్చాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: కాటన్ పార్కులో సౌకర్యాలు మెరుగుపర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యను కలసి వినతి పత్రం ఇచ్చారు. పార్కులో ఆటవస్తువులు పాడయ్యాయని చెప్పారు. జూరుడు బల్లలు, ఊయలలు మరమ్మతులు చేయాలని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో పార్కును అభివృద్ధి చేశారని, ప్రస్తుతం గతంలో మాదిరిగా పార్కు అభివృద్ధిలో పర్యవేక్షణ లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణ రావు, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్స్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సందీప్

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన పాలపర్తి సందీప్‌ను వైఎస్సార్ సీపీ వలంటీర్స్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఎన్నికలకు ముందు వలంటీర్ల రాజీనామా అంశం తెర మీదకు రాక ముందే పార్టీకి పని చేయాలనే ఆశయంతో సందీప్ వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయనకు పార్టీ మీద ఉన్న అభిమానమే తనకు ఈ పదవి రావడానికి ప్రధాన కారణం. సందీప్ ఇటీవలే జగన్‌మోహన్‌రెడ్డి కలిసి వలంటీర్స్ అవస్థలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా తనకు ఈ పదవి రావడానికి సిఫారసు చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)లకు సందీప్ కృతజ్ఞతలు తెలిపారు. సందీప్‌ను పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు, ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్, మాజీ కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తదితరులు అభినందించారు.

వారాహి అమ్మ సేవలో ఎమ్మెల్సీ కవురు


మల్లిపూడిలో వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో ఉన్న శ్రీవారాహి అమ్మవారిని శనివారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

పోష్ చట్టంపై అవగాహన

భీమవరం: పని చేస్తున్న ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు చేస్తే పోష్ చట్టం ప్రకారం శిక్ష తప్పదని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక 3వ అదనపు జిల్లా కోర్టులో ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు పోష్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల పరిరక్షణకు ఎన్నో చట్టాలున్నా నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) హనీషా, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన కాంతం దుర్గ భవాని ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్ చదవడానికి పాలకొల్లు వెళ్తుంది. ఆమె కళాశాలకు వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న పాలకొల్లు యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ (యూకేఎస్‌సీ) సభ్యులు శనివారం భవానికి క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు చేతుల మీదుగా రూ.7 వేలు విలువైన సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, సభ్యులు పోకల రాము, రావూరి అప్పారావు, కానూరి ప్రభాకర్, చుండూరి రంగయ్య నాయుడు పాల్గొన్నారు.

ఎస్వీకేపీ కళాశాలకు రాష్ట్ర స్థాయి 12వ ర్యాంకు


పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల

పెనుగొండ: ఎడ్యుకేషనల్ వరల్డ్ ఇండియా 2025-26 సంవత్సరానికి చేసిన సర్వేలో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 99 వ ర్యాంకు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 19 కళాశాలలకు ర్యాంకులు రాగా, అందులో పెనుగొండ కళాశాలకు 436 పాయింట్లతో ర్యాంకు రావడం ఆనందంగా ఉందన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాల జాతీయ, రాష్ట్ర స్థాయి ర్యాంకును సాధించినందుకు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్‌లు అభినందనలు తెలిపారు.

వాసవీ ధాం పరిశీలన


పెనుగొండ వాసవీ ధాంను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసిరాజు

పెనుగొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్రాలో భాగంగా పెనుగొండలో నిర్వహించబోయే యోగా కార్యక్రమానికి అనువైన ప్రాంతాలను నర్సాపురం ఆర్డీఓ డి.దాసిరాజు పరిశీలించారు. శనివారం పెనుగొండలోని అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంను పరిశీలించి ఎంపిక చేశారు. జూన్ 3న పెనుగొండలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

1153 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నరసాపురం రూరల్: వరిలో 1153 రకం ధాన్యాన్ని కొనుగోలుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శనివారం పసలదీవి గ్రామంలో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు 1153 రకం సాగు చేశారన్నారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత ఈ రకం ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు నానా అగచాట్లు పడాల్సి వస్తుందని ఆయన అన్నారు. మండలంలో ఈ రకం ధాన్యం సుమారు 1500 టన్నులు వరకు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మిగిలిపోయిన ధాన్యాన్ని వ్యవసాయ, రెవెన్యూ శాఖల ద్వారా రైతుల నుండి కొనుగోలు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి రైతు నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెద్దిరాజు తెలిపారు. లేని పక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు రైతులు గన్నాబత్తుల లక్ష్మణ స్వామి, యాళ్ళ ఏసుబాబు, యాళ్ళ నాగ సత్యనారాయణ, కొట్టు సుబ్బారావు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సారవ గ్రామంలో రోజుల తరబడి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆక్వా క్రాప్ హాలిడేకు విరామం

యలమంచిలి: జై భారత్ క్షీరా రామ ఆక్వా సంఘం పిలుపు మేరకు చేపట్టిన ఆక్వా క్రాప్ సాగు విరామం, చలో అమరావతి కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని సంఘ పాలకవర్గం నిర్ణయించింది. పాలకొల్లు మండలం ఆగర్తిలోని కల్యాణ మండపంలో శనివారం ఆక్వా సంఘ రైతుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ రెండు విషయాలపై చర్చించి తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. పూలపల్లిలో గృహ వినియోగ అవసరాల కోసం విక్రయించే రిటైల్ దుకాణం సముదాయం ప్రారంభానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడు ఈ నెల 9 లేదా 10 వస్తారని, ఆయనకు ఈ సమస్యపై వినతి పత్రం అందజేసి సమస్య పరిష్కరించుకుందామని నిర్ణయించారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే చలో అమరావతి కార్యక్రమం నిర్వహించి వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పంట విరామం ప్రకటించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు సంఘ నాయకులు బోనం చినబాబు, బోనం వెంకట రంగయ్యనాయుడు, మేక ఫణీంద్ర ప్రసాద్, మేడిది జాన్ డేవిడ్ రాజు, అంగర వరప్రసాద్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, పెన్మెత్స వెంకట సత్యనారాయణ రాజు, చంటి రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా సంఘ అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

యలమంచిలి: మహిళా ఉద్యోగుల రక్షణకు ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాలని పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ షేక్ జియావుద్దీన్ కోరారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అమరావతి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏలూరు వారి ఆదేశాల మేరకు శనివారం పాలకొల్లు న్యాయస్థానంలో ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్‌కు పని ప్రదేశాలలో మహిళల పై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013 పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ చట్టం ఆవశ్యకతను, లక్ష్యాలను, శిక్షలను ప్యానెల్ న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు వివరించారు. ప్రతి ఒక సంస్థ మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు ఈ చట్టం పై అవగాహనా కల్పించాలని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియచేసి తగు న్యాయం చేసే బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. సమావేశంలో అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) లక్ష్మీ లావణ్య ప్యానెల్ న్యాయవాదులు రవి, పూర్ణ, రవిచంద్ర, పల్లవి, పారా లీగల్ వలంటీర్స్ శర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


లైంగిక వేధింపుల నిషేధ చట్టం అవగాహనా సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్యకు సత్వర చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ జామి హైమావతి ఆదేశించారు. సమావేశ హాలులో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన హైమావతి మాట్లాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు వాటి పరిష్కారాన్ని కూడా వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. నగర పంచాయతీ కార్యాయలంలో సిబ్బంది కొరతను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆదాయ మార్గాలు చూడకుండా నిర్లిప్తంగా వ్యవహరించడం తగదన్నారు. నాన్‌లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణం వల్ల నగర పంచాయతీకి లక్షలాది రూపాయల ఆదాయం పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాళీ స్థలాలు, పన్ను వసూళ్లకు డిమాండ్ నోటీసులు తక్షణం ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ మాదివాడలోని పలు రోడ్లకు ఉన్న పేర్లను మార్చివేశారని, ఎన్ని సమావేశాల్లో ప్రస్తావించినా చర్యలు తీసుకోవడంలేదని కమిషనర్‌పై మండిపడ్డారు. సిబ్బంది కొరత వల్ల జాప్యం జరుగుతుందని కమిషనర్ కృష్ణ మోహన్ తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

వ్యవసాయంలో సాంకేతికతను జోడించాలి

ఉండి: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే అధిక దిగుబడులు,అధిక ఆదాయాన్ని రైతులు ఆర్జించవచ్చునని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు.శనివారం ఉండి మండలం పాందువ్వ నిర్వహించిన కేంద్రప్రభుత్వ కార్యక్రమం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సాగులో అదనపు,అనవసరపు ఖర్చులు తగ్గడంతో పాటు లాభాలు వస్తాయని సూచించారు. రైతులు మట్టి నమూనాలను తప్పని సరిగా పరీక్షించుకోవాలని, ఎరువుల వాడకంపైనా వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. అలాగే సార్వా పంటకు మేలైన రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని అన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులంతా సార్వాలో నూతన, మేలైన వంగడాలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు కొందరికి ధాన్యం నగదు బ్యాంకు ఖాతాల్లో పడాల్సి ఉందని మరికొద్ది రోజుల్లో జమఅవుతుందని రైతులను సముదాయించే మాటలు చెప్పారు. కేవీకే ముఖ్యశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, సహదేవుడు, డాక్టర్ వినయలక్ష్మీ, సర్పంచ్ యామిని ప్రియాంక, ఏఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.


ఉండి: పాందువ్వలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

రైతులు సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

భీమవరం అర్బన్: రైతులు సాగులో వినూత్నంగా ఆలోచించి సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉండి కేవీకే మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, తాడేరు, బేతపూడి గ్రామాలలో శనివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.


భీమవరం అర్బన్: తుందుర్రులో మాట్లాడుతున్న డాక్టర్ ఎ.శ్రీనివాసరావు

నాటి రేషన్ కష్టాలు నేటి నుంచి మొదలు

ఎండీయూ వాహనాలు కనుమరుగు

పాలకొల్లు సెంట్రల్: రేషన్ లబ్ధిదారులకు నాటి కష్టాలు నేటి నుండి ప్రారంభంకానున్నాయి. గత ప్రభుత్వాల్లో రేషన్ డిపోలకు వెళ్లి లబ్ధిదారులు రేషన్ సరుకులు తెచ్చుకునే వారు. షాపులు వద్ద ప్రతీరోజు బారులు తీరి నిలబడేవారు. ఇలా సరుకుల కోసం రోజువారి పనులు చేసుకునే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు వారు చేసే పనులకు సెలవు పెట్టి ఓ రోజంతా షాపులు వద్ద వేచి ఉండి సరుకులు తెచ్చుకునేవారు. ప్రజల సమస్యను పాదయాత్ర ద్వారా పరిశీలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటింటికీ సంక్షేమం అందించాలనే సంకల్పంతో వ్యాన్‌ల ద్వారా రేషన్ పంపిణీ ప్రజల చెంతకే చేర్చారు. దానితో రేషన్ షాపుల వద్దకు వెళ్లి క్యూలో నిలబడి సరుకులు మోసుకుని ఇంటికి తెచ్చుకునే ప్రజల కష్టాలన్ని తీరిపోయాయి. ప్రతినెలా 15వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి ఎండియూ వాహనాల ద్వారా రేషన్ నిత్యావసర సరుకులు అందించేవారు. కాని నేటి నుంచి ప్రజలకు మళ్లీ రేషన్ షాపుల వద్దకు పోయి క్యూలైన్లో నిలబడి తమ నిత్యవసర సరుకులు తెచ్చుకునే కష్టాలను ఈ కూటమి ప్రభుత్వం తీసుకురానుంది.

ఇదీ పరిస్థితి

నియోజకవర్గంలో పాలకొల్లు పట్టణంలో, మండలం, యలమంచిలి మండలంలో సుమారు 61 వేల మంది లబ్ధిదారులకు కష్టాలు ప్రారంభం కానున్నాయి. పట్టణంలో 16428, మండలంలో 22013, యలమంచిలి మండలంలో 23450 కార్డులు ఉన్నాయి. 61,891 కార్డుల లబ్ధిదారులకు ఉన్నారు. పాలకొల్లు పట్టణం, మండలంలో 74, యలమంచిలి మండలంలో 53 రేషన్ షాపులు ఉన్నాయి. దాదాపుగా రెండు లక్షల మంది జనాబా లబ్ధి పొందుతునున్నారు.


ఇంటింటికీ ఎండియూ వాహనం ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్న దృశ్యం

రేషన్ షాపుల ద్వారా పంపిణీ


ఆదివారం నుంచి రేషన్ షాపులు వద్ద రేషన్‌ను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి నెలా 1 నుండి 15వ తేదీ వరకూ ఉదయం 8 నుండి మద్యాహ్నం 12 గం వరకూ అలాగే సాయంత్రం 4 నుండి రాత్రి 8 గం వరకూ అందిస్తారు. 65 ఏళ్ల పై బడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ డీలర్ వచ్చి సరుకులు అందజేస్తారు. ఖచ్చితమైన సరుకులు తూచి రశీదు కూడా ఇస్తాం.

– యడ్ల దుర్గాకిషోర్, తహసీల్దార్, పాలకొల్లు

ప్రభుత్వానికి కనికరం లేదు


ఈ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమంపై కనికరం లేదు. ఎన్నికల సమయంలో ఇస్తానని చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి మనసురాని కూటమి ప్రభుత్వానికి ఉన్న పథకాలను రద్దు చేయడానికి మాత్రం ముందుకు రావడం దారుణం. వలంటీర్ వ్యవస్థ రద్దుతో ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు రేషన్ వాహనాలు కూడా ఆపివేయడం సమంజసం కాదు.

– ఇనుకొండ ధనలక్ష్మీ, ఎంపీపీ, యలమంచిలి